క్లుప్తంగా

ఘనంగా పూజలు



పూలందుకుంటున్న గణపయ్య

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని పాత కాలేజీ మైదానంలో గణేష్‌యూత్ ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి స్థానికులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. దాతలు జగేంద్ర, సురేంద్రల ఆర్థిక సహకారంతో పెద్ద ఎత్తున వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ములకలచెరువు: మండలంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వైఎస్సార్ కడప విజిలెన్స్ అధికారి నారాయణప్ప, ఏవో శ్రవంతి కలిసి రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి సూచనలు చేశారు యూరియా, ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామని వారు హెచ్చరించారు.

ముదిరిన ఆలయ వివాదం



ఆలయానికి తాళం వేయడంతో బయటే పూజలు చేస్తున్న ప్రజలు

ములకలచెరువు: మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ బూడిదగడ్డలో ఆలయ వివాదం ముదిరి తారాస్థాయికి చేరింది. దీంతో పురాతన శివాలయం దుస్థితి శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పండుగ రోజు పూజారి ఆలయానికి తాళాలు వేశారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని తిట్టారని తెలిపారు. గుడి మాన్యం ఆక్రమించుకొని దీప, ధూప నైవేద్యాలకు శివుడు నోచుకోవడం లేదని గ్రామస్తులు మండి పడుతున్నారు. సంబంధిత అధికారులు విచారణ చేయాలని కోరారు.

విశ్వం ప్రభాకర్‌రెడ్డికి అవార్డు



ప్రభాకర్‌రెడ్డి

కురబలకోట: మదనపల్లి సమీపంలో అంగళ్లు మార్గంలోని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం. ప్రభాకర్ రెడ్డికి రాయల్ పర్సనాలిటీ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. దుబాయ్ యుఏఈలోని జెనెసిస్ అల్టిమా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. విద్యా రంగంలో ప్రభాకర్ రెడ్డి చేసిన కృషికి అవార్డు ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని సంస్కరణల కోసం కృషి చేస్తానని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

బి.కొత్తకోట: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆటోడ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న భీమా పథకం, పెట్రోధరల తగ్గింపు, సంక్షేమబోర్డు ఏర్పాటు, కొత్త వాహనాలకు ఐదుశాతం వడ్డీతో రుణాలు మంజూరు హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపప్రధాన కార్యదర్శి సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, ఆంజనేయులు, నాగిరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

బి.కొత్తకోట: స్థానిక పోకనాటివీధిలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి భక్తులు, ప్రజలకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కంచి లోకేష్‌రెడ్డి, కంచి కల్యాణ్‌రెడ్డి, కంచి కోదండ, విశ్వనాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, వంక నారాయణరెడ్డి, సందీప్‌రెడ్డి, మారెడ్డి రవి, సాయి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు ననగరం పట్టాభి రామయ్య శుక్రవారం బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తన మనవడు (కశ్యప్ మిహిరాన్) నామకరణం సందర్భంగా భక్తులకు అన్నదానం చేసి పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలోని పలు వినాయకస్వామి మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండపాల వద్ద డీజే డ్యాన్సులు, కోలాటాలు, చెక్క భజనలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎల్‌బీఎస్ రోడ్డులో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

దారులు అధ్వానం.. అవస్థల ప్రయాణం

ముందే దెబ్బతిన్న రోడ్లు. వాటికి మరమ్మతులు మరిచిన అధికారులు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. దీంతో పాదచారులు, వాహనదారులు ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రమాదాలు జరుగుతుండగా, ప్రజలు భీతిల్లిపోతున్నారు.

- నరకప్రాయంగా మారిన ప్రయాణం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కుంగిపోయిన సుబ్బిరెడ్డిగారిపల్లె- కృష్ణాపురం రోడ్డు

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. నిర్మాణ పనుల్లో నాణ్యత లేక పోవడంతో తారు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల దెబ్బతిన్న బీటీ రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.

దెబ్బతిన్న గ్రామీణ రహదారులు

- గుర్రంకొండ- గాలివీడు మార్గంలోని మామిళ్లవారిపల్లె వద్ద పలుచోట్ల తారు రోడ్లు దెబ్బతిన్నాయి. చిన్నపాటి వర్షాలకే పలుచోట్ల రోడ్డు కోసుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
- తరిగొండ- రేగడపల్లె వరకు ఉన్న బీటీ రోడ్డు దెబ్బతిని పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి.
- సరిమడుగు- తరిగొండ వరకు ఉన్న రహదారి పలుచోట్ల తారు కొట్టుకుపోయిన కంకర తేలిపోయింది. గోతులు ఎక్కువగా ఉండడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.
- సుబ్బిరెడ్డిగారిపల్లె- కృష్ణాపురం బీటీ రోడ్డు దెబ్బతింది. నగం రోడ్డు మొత్తం కోసుకుపోయి ఓవైపుకు ఒరిగిపోయింది. రోడ్డు పక్కనే దిగుడుబావి కూడా ఉంది. రాత్రిళ్లు ఇక్కడ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.
- ఎల్లుట్ల నుంచి నగరి వరకు ఉన్న తారు రోడ్డు చాలా వరకు దెబ్బతింది. చెరువు కట్టపై గతంలో బీటీ రోడ్డు వేశారు. పలుచోట్ల రోడ్డు చీలిపోయింది. పలుచోట్ల పూర్తిగా ఓరిగిపోయి కట్ట దెబ్బతింటోంది.
- కేశాపురం- టి.పసలవాండ్ల వరకు ఉన్న తారు రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిపై పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. నీళ్ల నిలవడంతో గుంతలు కనిపించడం లేదు.

బెంబేలెత్తున్న ప్రయాణికులు

అసలే అధ్వాన రోడ్లు.. ఆపై వర్షాకాలం. ఇంకేముంది చిన్న చిన్న వానలకే పల్లె రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఈ మట్టిరోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక పాదచారుల పరిస్థితి మరీ అధ్వానం. కాగా, ఆయా గ్రామాలకు అంబులెన్స్‌లు, ఆర్టీసీ బస్సులు రాని దుస్థితి నెలకొంది. ఈ రోడ్లపై ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. కాగా, ఇంకా పదుల సంఖ్యలో గ్రామాలు కనీస రోడ్డు వసతికి నోచుకోవడం లేదు. అక్కడక్కడున్న బీటీ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో అవి కూడా పూర్తిగా ధ్వంసమైపోయాయి.

సగం రోడ్డు కుంగిపోయింది



మండలంలో పలు రోడ్లు నెర్రెలు చీలి ఓవైపుకు ఒరిగిపోయాయి. వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. ప్రతిరోజు ఇక్కడ వాహనాలు ప్రమాదాలకు గురువుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

–రమణమ్మ, కొత్తపల్లె

మరమ్మతులు చేపట్టాలి



కేశాపురం- నుంచి టి.పసలవాండ్లపల్లె వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఓచోట రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇప్పటివరకు తాత్కాలికంగా మరమ్మతులు కూడా చేపట్టలేదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.

– నాగప్ప, టి.పసలవాండ్లపల్లె

నైపుణ్యాలే ఉద్యోగాలకు కీలకం



మాట్లాడుతున్న మురళి పగడాల

కురబలకోట: ట్రెండ్స్ కాలానుగుణంగా వస్తున్న నైపుణ్యం సాధిస్తే ఉద్యోగాలకు డోకా లేదని బెంగళూరు ప్యారిటిక్ సాఫ్ట్ అండ్ అచీవర్స్ ఐటీ సీఈఓ మురళి పగడాల అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే కేరీర్‌ను దిశా నిర్దేశం చేసుకోవాలన్నారు. అంతేగాకుండా భవిష్యత్ అవకాశాలను ముందుగానే తెలుసుకోవాలన్నారు. చదువులో రాణిస్తూ పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలపై పట్టు సాధించాలని సూచించారు.

విద్యార్థుల సంబరాలు

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల క్రీడాపోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని క్రీడాప్రతిభను చాటారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కే.సత్యనారాయణమూర్తి అభినందించారు.

అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది



బాధితులను పరామర్శిస్తున్న నిసార్ అహ్మద్

మదనపల్లె: టీడీపీ శ్రేణుల దాడులకు భయపడొద్దు, పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం మదనపల్లె రూరల్ మండలం మాలేపాడు పంచాయతీ దిగువ దొనబైలులో పర్యటించిన ఆయన గ్రామంలో టీడీపీ దాడుల్లో భాధితులైన వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి జరిగిన దాడులు, గాయపడిన బాధితుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ దొనబైలులో దాడులు చేస్తూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీని బలహీనం చేసే చర్యలను ఎదుర్కొంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిన్న చిన్న విషయాలను వివాదాస్పదం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోలీసులు ఏకపక్ష ధోరణి వీడాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నిసార్ అహ్మద్, మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డిని నాయకులు సత్కరించారు. సర్పంచు గణేష్, లక్ష్మీదేవి, హరి, చలపతి, చంద్ర, నాగరాజ, వెంకటరమణ, భాస్కర్‌రెడ్డి, మహేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించం



వినాయకుడికి పూజలు చేస్తున్న డీఎస్పీ మహేంద్ర

ములకలచెరువు: వినాయకుడి విగ్రహాల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. శుక్రవారం ఆయన పీటీయం, తంబళ్లపల్లె, ములకలచెరువు మండలాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మండలాల్లో 504 విగ్రహాలు ఏర్పాటు చేశారని, ఉత్సవ కమిటీలకు పలు సూచనలు అందించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎక్కువ శబ్దం లేకుండా పూజలు నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు నరసింహుడు, ఉమామహేశ్వర్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద డీఎస్పీ మహేంద్ర పూజలు చేశారు.

ఘనంగా హాకీ క్రీడా దినోత్సవం



ప్రతిభ కనబరిచిన హాకీ క్రీడాకారులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: జాతీయ క్రీడా దినోవత్సం మదనపల్లెలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ క్రీడామైదానంలో హాకీ జిల్లా లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. నాలుగు బాల, బాలికల జట్లు పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన జట్లకు ప్రోత్సాక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హాకీ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, సీనియర్ హాకీ క్రీడాకారుడు మనోహర్‌నాయుడు, బిట్టు, జలజ, నరేష్, హితేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రెడ్డీస్‌కాలనీలో మార్పూరి సుబ్బారెడ్డి మెమోరియల్ బాడ్మింటన్ టోర్నమెంటు నిర్వహించారు. ఇందులో అండర్ -11,14, అడ్వాన్స్ అండర్ 17,19 కేటగిరిలలో పోటీలు జరిగాయి. ఇందులో ప్రతి కేటగిరిలో సింగిల్, డబుల్స్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు అందజేశారు. పురుషుల సింగిల్ విజేత కుషాల్‌రెడ్డి, మహిళల సింగిల్స్ విజేత శరణ్యారెడ్డి, అండర్-19 ప్రణీత, మునిచరణ్, అండర్-17 కనిష్క, ధనుష్, అండర్-11 బాలికల సింగిల్స విజేత దేవిశ్రీప్రియ, రన్నర్ హనిత్విక, బాలుర విజేత హర్షిత్, రన్నర్‌గా సాహస్, డబుల్స్ విభాగం పురుషుల విభాగంలో విజేతగా కుషాల్, నజీఫ్, బాలుర విభాగంలో ప్రదీప్, మునిచరణ్, బాలికల విభాగంలో యుసిక, దేవిశ్రీప్రియ, బాలుర విభాగంలో హరిత,రిత్విక్‌నాయక్ గెలుపొందినట్లు తెలిపారు. కోచ్ మహేంద్రనాయక్, ఉదయ్, విక్కి చరణ్, అపర్ణ, నరేష్, ఎస్వీవీ ఎస్ డైరెక్టర్ సుదర్శన్, పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలకు ఎంపిక

మదనపల్లె రూరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) నిర్వహించే క్రీడాపోటీలకు మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ (ఉమ్మడి చిత్తూరుజిల్లా) విద్యార్థిని అర్చన ఎంపికైందని ప్రిన్సిపాల్ ఎం.గీత తెలిపారు. శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎం.గీత మాట్లాడుతూ మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయకు చెందిన 90మంది విద్యార్థులు క్లస్టర్‌స్థాయిలో వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. అందులో 78 మంది విద్యార్థులు విజయం సాధించి రీజినల్‌స్థాయి క్రీడాపోటీలకు, అందులో ఆరుగురు విద్యార్థులు ఉత్తమ క్రీడాప్రతిభ కనపరిచి నవోదయ జాతీయ క్రీడలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న తాలూకా సీఐ

మదనపల్లె రూరల్ : గణేష్ నిమజ్జనానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని తట్టివారిపల్లె చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, మండల పరిధిలో సుమారు 350 నుంచి 400 వరకు వినాయక విగ్రహాలు ఏర్పాటుచేశారన్నారు. వీటిలో కొన్నింటిని స్థానికంగా ఉండే చెరువుల్లో నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పడంతో వారికి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు. మదనపల్లె పట్టణంలోని విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మండలంలోని తట్టివారిపల్లె చెరువు, బసినికొండ బైపాస్‌రోడ్డులోని పీపీఆర్ కన్వెన్షన్ వెనుకవేపు ఉన్న సామిచెరువు, అరేబియా హోటల్ పక్కన చెరువు, రామాచార్లపల్లె చెరువులను ఎంపిక చేశామన్నారు. తట్టివారిపల్లె చెరువులో పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా లైటింగ్, బారికేడ్ల ఏర్పాటుతో పాటు క్రేన్‌లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. బైపాస్‌రోడ్డు అరేబియా హోటల్ పక్కన రాత్రిపూట నిమజ్జనం చేసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తట్టివారిపల్లె చెరువుకు విగ్రహాలను తీసుకువచ్చేవారు సీటీఎం రోడ్డు, దేవతానగర్ మీదుగా సచివాలయం వెనుక వైపున ఏర్పాటు చేసిన బారికేడ్లు, క్రేన్ వద్దకు చేరుకోవాలన్నారు. విగ్రహాన్ని నిమజ్జనం తర్వాత బైపాస్‌రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు.

ఎంపీ విడుదల కావాలని దర్గాలో ప్రార్థన



బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

పీలేరురూరల్ : తప్పుడు మద్యం స్కాం కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని కోరుతూ నెల్లూరు బారాషహీద్ దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం పలువురు ముస్లిం నాయకులు దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి తోపాటు పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానుల్లో ఆత్మస్థైర్యం నింపాలని కోరారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు సర్పంచ్ హబీబ్‌బాషా, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి సిరాజ్‌బాషా, అబీద్, కలకడ కరీముల్లా, ఆబీద్, కలకడ కాలేషా, కాజీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రవేశిస్తే చర్యలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట గ్రామంలోని సర్వే నంబర్ 239 లో ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బావాజాన్ చెప్పారు. ఈ ప్రభుత్వ భూమిలో కొందరు దుక్కులు దున్నినట్లు సమాచారం అందడంతో ఆర్ఐ, వీఆర్‌లను పరిశీలనకు పంపినట్టు చెప్పారు. ఇందులోకి ఎవరైనా వచ్చినా, ఆక్రమణ యత్నాలకు పాల్పడినా తక్షణ క్రిమినల్ చర్యలుంటాయని హెచ్చరించారు.

వెళ్లి రావయ్యా.. పార్వతీ తనయా



కేవీపల్లె: గణేష్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కలికిరిలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

పెద్దతిప్పసముద్రం: మండలంలో శుక్రవారం పలు చోట్ల వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిమలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. గణపతి బొప్పా హోరియా అంటూ యువకులు కేరింతలు వేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. వెళ్లి రావయ్యా పార్వతీ తనయా అంటూ గణనాథుడిని సాగనంపారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోలాహలంగా నిమజ్జనానికి తరలిన వినాయకుడు

కలికిరి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడు మూడు రోజుల పాటు పూజలందుకుని శుక్రవారం భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలిలాడు. కలికిరి పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కలికిరి పెద్ద చెరువు, కలికిరి ప్రాజెక్టు, కుంటలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్ర కళాకారుల ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ముందుగా సీఐ అనీల్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్, పంచాయతీ ఈఓ అశోక్ తదితరాలు నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ బలిజపల్లెలో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. శుక్రవారం గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసి బళ్లారి డ్రమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలో చెరువులో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

తెలుగుభాషను పరిరక్షించుకుందాం



పెద్దతిప్పసముద్రం: తెలుగు కవుల చిత్ర పటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నిమ్మనపల్లె : మోడల్‌స్కూల్‌లో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

మదనపల్లె సిటీ: మాతృభాషతోనే మానవజాతి మనుగడ సాధ్యమవుతుందని ప్రముఖ నవలా రచయిత టీఎస్ఎ క్రిష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనుమరుగవుతున్న తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ యూనివర్శిటీ రిటైర్డు ప్రొఫెసర్ చంద్రశేఖర్, అధ్యాపకులు జ్యోతి, వనజ, విష్ణుప్రియ, మోహన్‌బాబు, గురుమూర్తి, ఖాజావల్లి, హజీరాఖనం, శ్రీదేవి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు సాయిశంకర్‌రెడ్డి, సేగు రెడ్డప్ప రెడ్డి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగుభాష గొప్పతనాన్ని హెచ్ఎం సుబ్బారెడ్డి వివరించారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

కేవీపల్లె : స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో తెలుగ భాష దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో రెడ్డిబాషా మాట్లాడుతూ తెలుగుభాష గొప్పదనం గూర్చి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దేశభాషలందు తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ భాషను మనం కాపాడుకోవాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ శీనునాయక్, పాఠశాల ఛైర్మన్ రెడ్డిబాషా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెన్నూరి బాలాజి, తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, లీలావతి, రెడ్డిరాణి పాల్గొన్నారు.

పీలేరు : తెలుగు వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి అని విశ్రాంత తెలుగు అధ్యాపకులు విద్యాన్ బిక్కిపాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మార్సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమారాణి, రిటైర్డ్ హెచ్ఎం శ్రీరాములురాజు, కవి మురళీధర్‌రాజు, ఉపాధ్యాయులు నరసింహులు, నాగవేణి, రమణ, రమణారెడ్డి, భారతి, బాలాజీనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు భాష దినోత్సవం

బి.కొత్తకోట: స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం శుక్రవారం తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తిని స్మరించుకొంటూ తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలవేసి వందనం సమర్పించారు. ప్రతినిధులు కృష్ణారెడ్డి, వంక హరినాధరెడ్డి, దేసు నందన్, సుబ్బిరెడ్డి, వాకా హరినాధరెడ్డి, శ్రీకాంత్, సకలా ప్రభాకర, వెంకట్రామయ్య, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి

పెద్దతిప్పసముద్రం: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ-టూ గౌస్‌పీర్ సూచించారు. తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలో బూర్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం పద్మజ తెలుగు తెలుగు భాష గొప్పతనాన్ని చక్కగా వర్ణించారు. అనంతరం 116 మంది తెలుగు కవుల చిత్ర పటాలను విద్యార్థులతో ప్రదర్శింపజేశారు.

అమ్మభాష పరిరక్షణ అందరి బాధ్యత

కలకడ : అమ్మభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అష్టావధాని జగన్నాథశాస్త్రి అన్నారు. శుక్రవారం మండలంలోని కె.బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన తెలుగుభాష దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుకు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుభాష తల్లివంటిదని అన్ని విద్యార్థులకు ఇంటర్మీయట్ వరకు తెలుగు భాషను అమలు చేయాలని కోరారు. రంగస్థల కళాకారుడు మధుబాబు తెలుగు భాష గొప్పతాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు బాబురెడ్డి, ఉమాదేవి, మధు, మురళి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. తెలుగుభాషా ప్రాముఖ్యతను, సొగసును చాటిచెప్పేలా సంప్రదాయ దుస్తులు ధరించి, రామాయణ, మహాభారత, భాగవతాల్లోని పాత్రలను అద్భుతంగా పోషించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల క్రీడాపోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని క్రీడాప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కే.సత్యనారాయణమూర్తి అభినందించారు.

మస్టర్ రోల్ పద్ధతి అమలు చేయాలి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కార్మికులకు మస్టర్ రోల్ పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరామయ్య కోరారు. శుక్రవారం సర్పంచ్ హబీబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీలో 1985 నుంచి కార్మికులు పని చేస్తున్నారని, 2013 సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ జీవో నెంబర్ 551 మేరకు గతంలో టెండర్ పద్ధతి అమలు చేయాలని ఆదేశించారని తెలిపారు. ఆ పద్ధతికి వ్యతిరేకంగా 2023 జూన్ 25న హైకోర్టును ఆశ్రయించగా మస్టర్ రోల్ పద్ధతిలో జీతాలు చెల్లించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత డీపీవో అందుకు విరుద్ధంగా టెండర్ పద్ధతిని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం సమంజసం కాదని హితవుపలికారు. పాత పద్ధతిలో వేతనాలు ఇవ్వక పోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.